క్లుప్తంగా

తాడిమళ్లలో అన్నసమారాధన

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్ర ఉత్స వాల ముగింపు సందర్భంగా మండలంలోని తాడిమళ్ల గ్రామ ప్రధాన కూడలిలోని వినాయక ఆలయం వద్ద ఆదివారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చాగల్లులో..

చాగల్లు: ఆదివారం చాగల్లులో భారీ అన్నసమారాధన జరిగింది. వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన ఏర్పాట్లను ఉత్సవ కమిటీ కన్వీనర్ గ్రంధి రాంబాబు, సభ్యులు, గ్రామపెద్దలు పర్యవేక్షించారు. అన్న సమారాధనకు సమారు 10 వేల మంది భక్తులు హాజరై, స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు నిడదవోలులో..

నిడదవోలు: పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లోని పూజా గణపతి, కుమారస్వామి వార్ల ఆలయం వద్ద 101వ గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నస మారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట పంచాయతీ పరిధిలోని వెదుళ్లకుంట వద్ద నిర్వహిస్తున్న కోడి పందేలపై ఆదివారం గోపాలపురం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందేలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోళ్లను, నాలుగు కోడి కత్తులను, రూ.10,300 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె. సతీష్‌కుమార్ తెలిపారు.

సారా తయారీపై ఉక్కుపాదం

- విస్తృతంగా సెబ్ అధికారుల దాడులు
- నిడదవోలులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఏర్పాటు
- ధాబాల్లో మద్యం తాగకుండా నియంత్రణ

నిడదవోలు రూరల్: సారా తయారీ స్థావరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఇందుకోసం అటు పోలీసులు, ఇటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు సారా తయారీ కేంద్రాలపై ముమ్మరంగా దాడులు జరిపి, సారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుతున్నారు. ఇందుకోసం నిడదవోలులో ఈ ఏడాది జనవరి 1 నుంచి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ ఏర్పాటు చేశారు. సెబ్ అధికారులు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో గ్రామాల్లో విస్తృతంగా దాడులు జరిపి, సారా తయారీని నియంత్రిస్తున్నారు.



నిడదవోలులో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్


సమిశ్రగూడెంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు (ఫైల్)

ప్రత్యేకంగా పర్యవేక్షణ

నిడదవోలు మండలంలోని రావిమెట్ల, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, గోపవరం, పురుషోత్తపల్లి, ఉనకరమిల్లి, పెరవలి మండలంలోని కానూరు, ఖండవల్లి, తీపర్రు వంటి లంక భూముల్లో సారా తయారీ జోరుగా సాగేది. లోగడ కొవ్వూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిడదవోలు మండలం, తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉండ్రాజవరం, పెరవలి మండలాలు ఉండేవి. పరిధి పెద్దది కావడంతో అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉండేది. అదీగాకుండా కరోనా సమయంలో మద్యం విక్రయాలు లేకపోవడంతో చాగల్లు మండలం చిక్కాల, అత్రేయపురం మండలం పేరవరం, రాజవరం, వెలిచేరులలో ఇష్టానుసారంగా సారా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల్లో తయారైన సారాను కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా మిగిలిన గ్రామాలకు తరలించి చాటుగా విక్రయాలు జరిపేవారు. పరిస్థితిని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి గ్రామాలను దత్తత తీసుకుని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సెబ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఎస్‌ఈబీ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్, నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం సారా కట్టడిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దానికితోడు నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కృషితో నిడదవోలులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ ఏర్పాటైంది. క్రమేపీ స్థానిక అధికారుల దాడులు పెరగడం, కేసులు నమోదు చేస్తుండడంతో సారా విక్రయాలు తగ్గాయి. సారా తయారీ, అక్రమ మద్యం, పేకాట, వివిధ అసాంఘిక కార్యకలాపాలు, ధాబాల్లో మద్యం తాగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయాల మహిళా పోలీసుల సహకారంతో సెబ్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు

- నిబంధనలు ఉల్లంఘించిన నిడదవోలు మండలం ఉనకరమిల్లికి చెందిన వేముల శ్రీనివాస్‌రావును బైండోవర్ చేసి రూ.50 వేల జరిమానా విధించారు.
- ఇప్పటివరకూ ఐదు సారా విక్రయ కేసుల్లో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.
- గోవా, యానాం ప్రాంతాల నుంచి సుంకం చెల్లించకుండా తీసుకువచ్చిన అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న మూడు కేసుల్లో నలుగురిపై కేసు నమోదు చేసి 36.39 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- గోవా నుంచి మద్యం సరఫరా చేసిన తణుకు పట్టణానికి చెందిన ఇజ్జాడ పాపినాయుడిని అరెస్ట్ చేశారు.
- బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న 29 కేసుల్లో 44 మందిని అరెస్ట్ చేసి 71.23 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- బహిరంగ ప్రదేశంలో మద్యం తాగకుండా నియంత్రించేందుకు విజ్జేశ్వరంలో గోదావరి ధాబా రెస్టారెంట్‌లో మద్యం సేవిస్తున్న 16 మందిని అరెస్ట్ చేశారు.

సారా నియంత్రణకు చర్యలు



నిడదవోలు ఎస్ఈబీ పరిధిలో సారాను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాం. గతంలో సారా తయారీ, విక్రయాలు చేస్తున్న వారి వివరాలు మా దగ్గర ఉన్నాయి. వారిపై నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. అక్రమ మద్యం, సారా తయారీపై స్థానికులు మాకు సమాచారం అందించి సహకరించాలి. అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– కె.వీరబ్రహ్మం, సెబ్ సీఐ, నిడదవోలు

11, 18 తేదీల్లో నిడదవోలులో వైద్య శిబిరాలు

నిడదవోలు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో ఈనెల 11వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరంలో పట్టణంలోని రాయిపేట, సుబ్బరాజుపేట, ఎన్టీఆర్ కాలనీ సచివాలయాల ప్రజలు వైద్య సేవలు పొందవచ్చన్నారు. అలాగే స్థానిక లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో ఈనెల 18వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ మూడో విడత జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో స్థానిక సంత మార్కెట్, బస్టాండ్ సెంటర్, బసివిరెడ్డిపేట సచివాలయాల ప్రజలు వైద్య సేవలు పొందవచ్చని కమిషనర్ పద్మావతి వివరించారు.

15 నుంచి 23 వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు

కొవ్వూరు: ఈనెల 15 నుంచి 23 వరకూ పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు వాసవీ క్లబ్ అధ్యక్షుడు కక్కిరాల సూరిబాబు ఆదివారం తెలిపారు. రోజూ అమ్మవారికి గోత్ర నామాలతో కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. 15వ తేదీ ఉదయం 8.30 గంటలకు మద్దుల కృష్ణారావు ఇంటి నుంచి అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గోష్పాద క్షేత్రంలోని సరస్వతీ ఆలయంలోనూ ఈ నెల 15 నుంచి 23 వరకూ రోజు చండీ హోమం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు ఎస్ఎస్ వాజ్‌పేయ్ తెలిపారు. రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- ఐ.పంగిడిలో కొనసాగిన గడప గడపకూ..

కొవ్వూరు: ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేయారా? లేదా? అన్న తారతమ్యత చూడకుండా కేవలం పేదరికం అనే అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. మండలంలోని ఐ.పంగిడి పంచాయతీ పరిధిలో ఐదో రోజైన ఆదివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏయే కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. మంత్రి వనిత ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల భవాని, కామన రత్నాజీ, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పోసిన శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు.


మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు విగ్రహం ఆవిష్కరణ

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కలం నాగేశ్వరరావు విగ్రహాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. సర్పంచ్ గాను, ఉప సర్పంచ్ గాను, కాపు సంఘం అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన నాగేశ్వరరావు గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. నాగేశ్వరరావు స్మృతి చిహ్నంగా ఆయన తనయుడు రాజా రోడ్డు పక్కనే తమ వ్యవసాయ క్షేత్రంలో నాగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాగేశ్వరరావు తండ్రి వెంకట్రామయ్య ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిపాటి ప్రసాద్, కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, బోయపాటి రమేష్, బళ్ల నాని, మాజీ సర్పంచ్ గద్దే నరసింహారావు, నెక్కలపూడి రామకృష్ణ, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, సోదరులు శ్రీను, కృష్ణ, ప్రభాకరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 3,500 మందికి అన్నసమారాధన జరిగింది.


అనంతపల్లిలో ఆవిష్కరించిన మాజీ సర్పంచ్ కలం నాగేశ్వరరావు విగ్రహం

విరాళాలకు జవాబుదారీగా ఉండాలి

'మానవత' జోనల్ సమావేశంలో రామచంద్రారెడ్డి

నల్లజర్ల: దాతలు ఇచ్చిన విరాళాలకు మానవత స్వచ్ఛంద సంస్థ జవాబుదారీగా ఉండాలని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి వివిధ మండలాల కమిటీలకు సూచించారు. మానవత స్వచ్ఛంద సంస్థ 15 మండలాల కార్యవర్గ సభ్యుల సమావేశం ఆదివారం స్థానిక అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమానికి ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు అధ్యక్షత వహించారు. రామచంద్రారెడ్డి తన ప్రసంగంలో దాతలు ఇచ్చిన విరాళాలకు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఆదాయ, వ్యయాలకు బ్యాంకు స్టేట్‌మెంట్లు పక్కాగా ఉండాలని, విరాళాలను చెక్కుల రూపంలోనే తీసుకోవాలని సూచించారు. 15 మండలాల్లో అత్యధిక సభ్యత్వాలు చేయించిన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను ఈ సందర్భంగా ఆయన శాలువాలతో సత్కరించారు. ఇంతవరకూ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్‌గా ఉన్న కండెపు వెంకట సూర్యనారాయణను జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్‌గా ఆలపాటి నాగేశ్వరరావును నియమించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


వివిధ మండలాల అధ్యక్షులను సత్కరిస్తున్న మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

సభ్యత్వాలు పూర్తి

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ చేపట్టిన సభ్యత్వాల నమోదు కార్యక్రమం మండలంలో నూరు శాతం పూర్తయ్యిందని ఆ సంస్థ మండల గౌరవాధ్యక్షుడు జొన్నలగడ్డ రాంబాబు చెప్పారు. స్థానిక శర్వాణి హైస్కూల్‌లో ఆదివారం మండల శాఖ సమావేశం నిర్వహించారు. సభ్యత్వ రుసుమును సంస్థకు అప్పగించినట్టు రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్, కె. కీర్తకుమార్, నెల్లి చంద్రశేఖర్, ముద్దన మురళి, కొయ్య నాగరాజు, హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫణికిషోర్ సభ్యులు పాల్గొన్నారు.

పోలియో ఫండ్‌కు విరాళం

నిడదవోలు: రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ పిలుపు మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోలియో ఫండ్ సేకరణ చేపట్టారు. ఇందుకు నిడదవోలు ప్రాంత విద్యుత్తు ఉద్యోగులు రూ.30 వేలను విరాళంగా క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు ఆదివారం అందజేశారు. పోలియో పల్స్ చైర్మన్ కొత్తపల్లి నాగేశ్వరరావు, గొన్నాబత్తుల రామారావు, క్లబ్ కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

ప్రేమ, కరుణ, క్షమాగుణం అలవరుచుకోవాలి

చాగల్లు: ప్రేమ, కరుణ, క్షమాగుణం అలవరుచుకుంటే జీవితం ఆనందంగా సాగిపోతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ జి.మంజుల అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్.ముప్పవరంలో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి మరో ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ ధ్యానం సర్వ రోగ నివారిణి, సత్యజ్ఞాన ప్రసాదిని, సకల భోగాల ప్రసాదిని అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏంఎ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల ధ్యానులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ పరీక్షలు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చర్చిపేటలో ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. హాజరైన వారికి వైద్య సేవలపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ మెంటర్ ఫణి సింహ, ఇంజె శేఖర్, ఆనందం మురళి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఈ-పోస్ యంత్రాలు

నల్లజర్ల: సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగా రేషన్ సరకులు సక్రమంగా అందడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. విజయవాడలోని కేంద్ర సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకమైన ఈ-పోస్ యంత్రాలు పనిచేయడం లేదు. దాంతో మూడు రోజులుగా ఎండీయూ ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. శని,ఆదివారాలలో ఈ-పోస్ యంత్రాలు పనిచేయక పోవడంతో వీరంతా వాహనాలను నిలిపివేశారు. ఈ-పోస్‌లో సరిగా నమోదు కాకపోవడంతో ఒక్కొక్క లబ్ధిదారునికి బియ్యం ఇచ్చేందుకు గంటకుపైగా సమయం పడుతోందని ఆపరేటర్లు వాపోతున్నారు. ఈనెల 17 లోగా అందరికీ రేషన్ పంపిణీ పూర్తవుతుందో లేదోనని ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్నారు. ఈ-పోస్ యంత్రాలు సక్రమంగా పనిచేసేలా సర్వర్‌లో సాంకేతిక లోపాలు సరిచేయాలని కోరుతున్నారు.

నిలిచిపోయిన రేషన్ పంపిణీ

దేవరపల్లి: సర్వర్లు పనిచేయక నాలుగు రోజులుగా రేషన్ సరుకుల పంపిణీ నిలిచిపోయింది. ఈ నెల 4 నుంచి రేషన్ సరులు పంపిణీ జరగడం లేదు. ఉన్నట్టుండి 4వ తేదీ మధ్యాహ్నం నుంచి సర్వర్ ఆగిపోయింది. దీనితో ఈ-పోస్ యంత్రాలు మూగబోయాయి. అప్పటి నుంచి ఇంటింటికీ రేషన్ పంపిణీ నిలిచిపోవడంతో కార్డు దారులు సరుకుల కోసం ఎండీయూ వాహనాల వద్ద నిరీక్షిస్తున్నారు. అధికారులు, ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు. సోమవారం నుంచి సర్వర్లు పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు.